

రైతుల ఖాతాలకు రూ.625 కోట్లు జమ : మంత్రి కృష్ణబైరేగౌడ

బెంగళూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పంట నష్టపోయిన 33 లక్షల మంది రైతుల ఖాతాలకు రూ.625 కోట్లు జమ చేస్తున్నామని రెవెన్యూశాఖ మంత్రి కృష్ణబైరేగౌడ తెలిపారు. నగరంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రైతుల ఖాతాలకు నగదు బదిలీ ప్రక్రియ సాగుతోందన్నారు. కరువు పరిహారంగా రూ.18,178 కోట్లు విడుదల చేయాలని కేంద్రానికి విన్నవించామన్నారు. ముఖ్యమంత్రి స్వయంగా ప్రధానమంత్రిని కలసి రాష్ట్రంలో కరువు పరిస్థితిని వివరించారని తెలిపారు. కేంద్ర హోంశాఖ మంత్రి, ఆర్థికమంత్రిని కలసి రాష్ట్ర కరువు పరిస్థితిని నివేదికల రూపంలో సమర్పించామన్నారు.



కర్ణాటక గ్యారెంటీలు



దేశానికే ఆదర్శం

- శాసనసభలో గవర్నర్ ప్రశంసలు
- గవర్నర్ నోట పచ్చి అబద్ధాలు
- ప్రతిపక్షాల మండిపాటు



ప్రసంగిస్తున్న గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్



కొలువుదీరిన ఉభయసభల సభ్యులు

బెంగళూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని దూరదృష్టి గల ప్రభుత్వం సంక్షేమ ఫలాలు ప్రజల చెంతకు తీసుకెళ్లడంలో సఫలీకృతమైందని గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ పేర్కొన్నారు. శాసనసభ ఉభయసభలను ఉద్దేశించి సోమవారం ఆయన ప్రసంగిస్తూ ప్రభుత్వం అమలులోకి తెచ్చిన ఐదు గ్యారెంటీ పథకాలు దేశం మొత్తానికి ఆదర్శంగా ఉన్నాయని పేర్కొన్నారు. భీకర కరువు వంటి ప్రతికూల వాతావరణంలోనూ సర్వతోముఖాభివృద్ధి వైపు రాష్ట్రం సాగుతోందన్నారు. పారదర్శక పాలనే మూల మంత్రంగా కలిగి ఉందని కొనియాడారు. ప్రజాపాలన రంగంలో ప్రభుత్వం విప్లవాత్మకమైన మార్పులకు తెర లేపిందన్నారు. సర్వజనుల శాంతితోటగా ఉన్న కర్ణాటకలో 8 నెలల అవధిలోనే జనరంజకపాలన అందిస్తూ అభివృద్ధికి రాచబాటలు వేస్తోందన్నారు. సంపద కేవలం కొద్ది మంది వ్యక్తుల చేతుల్లో కేంద్రీకృతమయ్యే విధానాలకు కాలం చెల్లిందని గవర్నర్ పేర్కొన్నారు. అట్టడుగున ఉన్న బలహీనవర్గాల్లో ఆర్థిక శక్తి నింపిననాడే సమాజం తానంతటదే అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందన్నారు. ఈ దిశలో గ్యారెంటీ పథకాలు ఒక చక్కటి ఆరంభమన్నారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే నూతన విద్యావిధానాన్ని రూపొందించనున్నట్టు గవర్నర్ తన ప్రసంగంలో నొక్కి వక్కాణించారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న వ్యవసాయ, పారిశ్రామిక సేవా రంగాల్లో కొత్త ఆశలు నింపేలా, సామాజిక న్యాయానికి సరైన నిర్వచనం ఇచ్చేలా ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ ప్రభుత్వం సరికొత్త చరిత్రను లిఖిస్తోందన్నారు. కర్ణాటక గ్యారెంటీ పథకాలు దేశానికే మాదిరిగా ఉన్నాయని గవర్నర్ తన ప్రసంగంలో ప్రస్తావించడం విశేషం. దేశ విదేశాల మీడియా గ్యారెంటీలను వేనోళ్లా కొనియాడుతోందన్నారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు గ్యారెంటీ పథకాల ఫలాలను ఆస్వాదిస్తున్నారన్నారు. రమారమి 1.2 కోట్ల మంది ప్రజలకు గ్యారెంటీ పథకాల ద్వారా లబ్ధి చేకూరుతోందన్నారు. గ్యారెంటీ పథకాలతో ప్రజల్లో ప్రత్యేకించి సామాన్యుల్లో కొత్త ఆర్థిక చైతన్యం వచ్చిందన్నారు. కేంద్రం చేస్తున్న అన్యాయాన్ని గవర్నర్ పరోక్షంగా ప్రస్తావించారు. పన్నుల వాటా, గ్రాంట్ల తారతమ్యం వంటి అంశాలను ఉదహరించిన ఆయన, కేంద్రం నుంచి మరింత సాయం అందితే అది రాష్ట్ర ప్రగతికి బలమైన బాటలు వేస్తుందని పేర్కొన్నారు. దేశంలోనే అత్యధికంగా పన్నులు సేకరించే రెండో రాష్ట్రంగా కర్ణాటక నిలిచిందన్నారు. జీఎస్టీ వాటాల విషయంలో పదోస్థానంలో ఉందన్నారు. న్యాయబద్ధంగా రాష్ట్రానికి దక్కాల్సిన సాయం, పన్నుల వాటా వంటివి పొందేందుకు నిరంతర ప్రయత్నాలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. కరువు పరిస్థితిని ప్రభుత్వం నిభాయించినట్టు పేర్కొన్నారు. గ్యారెంటీ పథకాలతో కరువు చాయలను కొంతమేరకు తగ్గించామన్నారు. 31 జిల్లాల్లో కరువు సహాయ కార్యక్రమాల కోసం రూ.324 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. పంటనష్టం ఎదుర్కొంటున్న రైతులకు తక్షణ సాయంగా తలా రూ.2వేలు చొప్పున 32.58 లక్షలమంది రైతులకు రూ.617 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లిస్తున్నామని గవర్నర్ పేర్కొన్నారు. కరువు తీవ్రత నేపథ్యంలో తాగునీరు, పశుగ్రాసం కొరత లేకుండా ప్రభుత్వం నిభాయిస్తోందన్నారు. కన్నడ భాష సంస్కృతులపై ఏవిధంగా స్వారీ జరిగినా సహించేందుకు సిద్ధంగా లేమని, మాతృభాష సంరక్షణకు ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోందని పేర్కొన్నారు. బసవణ్ణ, కువెంపు ఆదర్శాలతోనే రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలను పదిలంగా భావితరాలకు అందించే ప్రయత్నం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో నామఫలకాలు (నేమ్‌ప్లేట్స్) 60 శాతం కన్నడభాషలోనే ఉండాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన సంగతిని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, పీయూ కళాశాలలకు ఉచితంగా తాగునీటి సదుపాయం కల్పిస్తున్నామని గవర్నర్ వెల్లడించారు. బెంగళూరు సబ్ అర్బన్ రైల్వే పనులను సాధ్యమైనంత త్వరగా వేగిరంగా పూర్తి చేయడం ద్వారా ప్రజలకు అత్యుత్తమ రవాణా సదుపాయాలు కల్పించాలన్నది ప్రభుత్వ సంకల్పమన్నారు. 2026 జూన్ నాటికి ఎయిర్ పోర్ట్ మెట్రో సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. కిందిస్థాయి వరకు అత్యుత్తమ ఆరోగ్య సేవలను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. నరేగా ఉపాధి హామీ పథకాన్ని 100 రోజుల నుంచి 150 రోజులకు పెంచాలన్న తమ వినతిని కేంద్రం తప్పకుండా పరిశీలిస్తుందన్న ఆశాభావాన్ని గవర్నర్ తన ప్రసంగంలో వ్యక్తం చేశారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం

శాసనసభ ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించేందుకు విచ్చేసిన గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్‌కు ఘన స్వాగతం లభించింది. విధానసౌధ మెట్లపై నుంచి శాసనసభ లోపలి వరకు ఆయనను ముఖ్యమంత్రి సిద్దరామయ్య, స్పీకర్ యూటీ ఖాదర్, సభాపతి బసవరాజ్ హొరట్టి, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ సాదరంగా తోడ్కొని వెళ్లారు. గవర్నర్ బ్యాండ్ బృందం ప్రత్యేకంగా శ్రీరాముడిని స్తుతించే భక్తి గీతాన్ని ఆలపించడం విశేషం. విధానపరిషత్‌లో రాజ్యాంగ పీఠికను ప్రత్యేకంగా చదవడం ద్వారా కార్యకలాపాలను ప్రారంభించడం మరో విశేషం.



అసెంబ్లీ బయట జై శ్రీరామ్ నినాదాలు చేస్తున్న బీజేపీ సభ్యులు



గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్‌ను స్వాగతిస్తున్న శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి హెచ్‌కే పాటిల్, చిత్రంలో సీఎం, స్పీకర్, సభాపతి తదితరులు

గవర్నర్ నోట పచ్చి అబద్ధాలు : ప్రతిపక్షాల మండిపాటు

గవర్నర్ నోట ప్రభుత్వం పచ్చి అబద్ధాలు చెప్పించిందని బీజేపీ మండిపడింది. ప్రతిపక్షనేత ఆర్. అశోక్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎలాంటి అభివృద్ధి పనులు జరగడం లేదన్నారు. ప్రజాధనాన్ని లూటీ చేయడమే ఏకైక లక్ష్యంగా సాగుతోందన్నారు. కేంద్రప్రభుత్వ పథకాలను తమవిగా చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. యువనిధి పథకం ద్వారా ఇంతవరకు ఒక నిరుద్యోగికి కూడా సాయం అందలేదన్నారు. సర్వజనుల శాంతితోటలో హిందువులపై దౌర్జన్యాలు అధికంగా ఉన్నాయని, ఉగ్రవాద కార్యకలాపాలు చాపకింద నీరులా ఉన్నాయని, ఇంత జరుగుతున్నా శాంతి సామరస్యాలను కాపాడుతున్నామంటూ గవర్నర్ నోట చెప్పించడం విడ్డూరంగా ఉందన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగం గ్యారెంటీల చుట్టే సాగిందన్నారు. గవర్నర్ ప్రసంగం నీరసంగా ఉందని మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై వ్యాఖ్యానించగా, అభివృద్ధి మచ్చుకైనా లేదని గవర్నర్ ప్రసంగంలో ప్రభుత్వం పరోక్షంగా అంగీకరించిందని మాజీ సీఎం కుమారస్వామి పేర్కొన్నారు.

హైకోర్టులో డీసీఎం కేసు 19కి వాయిదా



బెంగళూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ కేసు విచారణను సీబీఐ నుంచి తప్పించి లోకాయుక్తకు కేటాయించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటీషన్లపై హైకోర్టు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. డీకే శివకుమార్‌పై సీబీఐ విచారణను ఉపసంహరిస్తూ రాష్ట్ర మంత్రిమండలి తీసుకున్న నిర్ణయియాన్ని సవాల్ చేస్తూ బీజేపీ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ దాఖలు చేసుకున్న పిటీషన్‌పై హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె. సోమశేఖర్, జస్టిస్ ఉమేశ్ ఎం అడిగతో కూడిన ధర్మాసనం, లోకాయుక్త ఏడీజీపీకి నోటీసు జారీ చేయాలని నిర్ణయించింది. అనంతరం తదుపరి విచారణను ఈనెల 19కు వాయిదా వేసింది. అంతకుముందు శివకుమార్ న్యాయవాదులు అభిషేక్ సింఘ్వి వాదన వినిపించారు. తమకు మరికొంత సమయం కావాలని అభిషేక్ కోరడంతో ధర్మాసనం ఈ నిర్ణయం తీసుకుంది. డీకే శివకుమార్‌పై సీబీఐ విచారణను రద్దు చేసి లోకాయుక్తకు అప్పగించడం చట్టబద్ధమేనని అంతకుముందు అభిషేక్ సింఘ్వి కోర్టులో వాదించారు.

లోక్‌సభకు పోటీపై ఇంకా నిర్ణయించుకోలేదు


- మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి



బెంగళూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు పోటీ చేసే అంశంపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని జేడీఎస్ నేత, మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి ప్రకటించారు. హాసన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగాలని తనకు అన్నివైపుల నుంచి ఒత్తిడి వస్తోందని తెలిపారు. మండ్య, తుమకూరు, చిక్కబళ్లాపుర, బెంగళూరు గ్రామీణ నియోజకవర్గాల నుంచి పోటీ చేయాల్సిందిగా అభిమానులు ఒత్తిడి తెస్తున్నారని, ఒకవేళ పోటీ చేసి గెలిస్తే ఖచ్చితంగా కేంద్రంలో కీలకమైన మంత్రిత్వశాఖ ఖాయమని అంటున్నారని తెలిపారు. జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవేగౌడతో చర్చించిన అనంతరమే తన పోటీపై తుదినిర్ణయం తీసుకుంటానన్నారు. జాతీయ రాజకీయాలకు వెళ్లే ఉద్దేశ్యం తనకు మొదటి నుంచి లేదని, రాష్ట్ర ప్రజలకు సేవ చేయాలన్నదే తన సంకల్పమన్నారు. ఒకవేళ మాజీ ప్రధాని హెచ్‌డీ దేవేగౌడ లోక్‌సభకు పోటీ చేయకపోతే అప్పుడు తన నిర్ణయాన్ని పరిశీలిస్తానని కుమారస్వామి వెల్లడించారు.

మార్చి దాకా తమిళనాడుకు 5 టీఎంసీలు

- సీడబ్ల్యూఆర్‌సీ సిఫారసు



బెంగళూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కావేరి నదికి అనుబంధమైన జలాశయాలలో నీటిమట్టం అడుగంటిపోయినా కావేరి నీటి నిర్వహణా ప్రాధికార (సీడబ్ల్యూఆర్‌సీ) లో మాత్రం మార్పు లేదనే ఆదేశాలు జారీ అయ్యాయి. సోమవారం ఢిల్లీలో జరిగిన సీడబ్ల్యూఆర్‌సీ సభలో కేఆర్‌ఎస్ నుంచి తమిళనాడుకు ఫిబ్రవరి, మార్చి నెలల్లో 5 టీఎంసీల నీటిని విడుదల చేయాలని సిఫారసు చేసింది. నెలకు 2.5 టీఎంసీలు విడుదల చేసేలా సూచించింది. కర్ణాటక జలనిపుణులు, ఇంజనీర్లు ప్రాధికార ముందు రాష్ట్ర ప్రాజెక్టులలో నీటి కొరతను వివరించారు. 2023 జూన్ నుంచి రెండు రోజుల క్రితం దాకా కావేరికి అనుబంధమైన నాలుగు జలాశయాలలో 52.43 శాతం నీటి కొరత ఉందని వివరించారు. ఇప్పటికే జలాశయాలు అడుగంటాయని తెలిపారు. 7.61 టీసీఎంలు మాత్రమే నీరు అందుబాటులో ఉందని, ఇందులో 5 టీఎంసీలు విడుదల చేస్తే రాష్ట్రంలో తాగునీటికి కష్టమని వివరించారు. నీరు విడుదల అసాధ్యమని, పునరాలోచించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై నిపుణులతో చర్చించేందుకు సిద్ధమైంది.

సంచారజాతుల నేతలతో సీఎం చర్చలు

బెంగళూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో అన్ని వర్గాల సంక్షేమానికి సముచిత ప్రాధాన్యత ఇవ్వాలని సంకల్పిస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఇందులో భాగంగా సచివాలయంలో సోమవారం సంచారజాతులకు చెందిన ప్రముఖ నేతలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వారి సమస్యలను ఆలకించారు. మంత్రులు శివరాజ్ తంగడగి, కేజే జార్జ్, డి. సుధాకర్‌తో పాటు మాజీ మంత్రి హెచ్. ఆంజనేయ, ముఖ్యమంత్రి ఆర్థిక సలహాదారుడు బసవరాజరాయరెడ్డితోపాటు పది మంది ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు. బలహీనవర్గాలకు చెందిన సంచార, గిరిజన కులాలకు చెందిన 260 మంది ప్రతినిధులు, నేతలు ఈ సమావేశంలో పాలుపంచుకున్నారు. బడ్జెట్‌లో అన్ని వర్గాల సంక్షేమానికి కార్యక్రమాలు ఉంటాయని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రకటించారు.



చర్చలు జరుపుతున్న సీఎం సిద్దరామయ్య


రామనగరను ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుతాం

- ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్

బెంగళూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రామనగరను ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలని సంకల్పం పూనినట్టు ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ వెల్లడించారు. జిల్లాకు కొత్తగా మంజూరైన అశ్వమేధ బస్సుల సంచారాన్ని సోమవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ బిడది ప్రాధికారను గ్రేటర్ బెంగళూరు ప్రాధికారలో విలీనం చేసే ఆలోచన ఉందన్నారు. ఇదే జరిగితే బిడది, ఆనేకల్‌కు మెట్రో సంచారం అందుబాటులోకి వస్తుందన్నారు. రామనగర జిల్లా సర్వతోముఖాభివృద్ధికోసం అన్ని శాఖల ప్రగతిని స్వయంగా తానే సమీక్షిస్తున్నట్టు తెలిపారు. రామనగర జిల్లాకు చెందిన కెంగల్ హనుమంతయ్య, బాలగంగాధరనాథస్వామిజీ, శివకుమారస్వామిజీ బెంగళూరులోనే ఎక్కువ సమయం గడిపేవారని పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగాన్ని అబద్ధాల పుట్టగా అభివర్ణిస్తున్న ప్రతిపక్షాల ఆరోపణలపై ఆయన మండిపడ్డారు. గ్యారెంటీ పథకాలు అబద్ధాలా..? అంటూ నిలదీశారు. రాముడి పేరిట రాజకీయాలు చేస్తున్నారంటూ ప్రతిపక్షాలపై నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో బెంగళూరు గ్రామీణ లోక్‌సభ సభ్యుడు చేసినన్ని అభివృద్ధి పనులు మరే ఏ ఎంపీ చేయలేదన్నారు. తనను జైలుకు పంపుతామంటూ మాజీ మంత్రి ఈశ్వరప్ప చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ తనకు వ్యతిరేకంగా ఇలాంటి కుట్రలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయన్నారు. ప్రజలు, దేవుడి ఆశీస్సులతో వీటిని ఎదుర్కొంటూ వచ్చానని తెలిపారు. మంత్రి రామలింగారెడ్డి మాట్లాడుతూ రానున్న ఐదేళ్లలో ఆర్టీసీ కోసం కొత్తగా 5,600 బస్సులు కొనుగోలు చేసే ఆలోచన ఉందన్నారు. తాజాగా వెయ్యి బస్సుల కొనుగోలు ప్రక్రియ మరో నెలరోజుల్లో పూర్తి కానుందన్నారు. శక్తి పథకం ప్రవేశపెట్టిన అనంతరం కోట్లాదిమంది మహిళలు ఉచిత ప్రయాణాలు చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎమ్మెల్యేలు ఇక్బాల్ హుసేన్, మాగడి బాలకృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న డీసీఎం డీకే శివకుమార్



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1587.98	1,612.27
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	76	7,421
సామర్థ్యం (టీఎంసీలు)	9.42	42.25

అభివృద్ధికి నోచుకోని ఏపీఎంసీ మార్కెట్



మట్టి గుంతలతో ఏపీఎంసీ రోడ్డు

కంప్లి, ఫిబ్రవరి 12 : అన్నదాతకు అండగా ఉండాల్సిన ఏపీఎంసీ మార్కెట్ అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. కంప్లి పట్టణంలో సుమారు 25 ఎకరాలలో 1973లో ఏపీఎంసీ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు హోస్పేట ఉప మార్కెట్‌గానే ఇక్కడ కొనసాగేది. 2022లో ఇక్కడే డైరెక్ట్ మార్కెట్ ఏర్పడింది. ఏపీఎంసీ మార్కెట్‌లో వ్యాపారస్తులు 91 మంది లైసెన్స్ పొంది వరి, మొక్కజొన్న కొనుగోళ్లు కొనసాగిస్తున్నారన్నారు. ఇంత మంది వ్యాపారులు పన్నులు చెల్లిస్తున్నా, సరిపడా ఆదాయం ఉన్నా అధికారులు మౌలిక వసతులపై శ్రద్ధ చూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కనీస సౌకర్యాలు లేక రైతులు, వ్యాపారస్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యుత్ లైట్లు, సీసీ రోడ్లు, స్వచ్ఛత, తాగునీటి సౌకర్యాలు కూడా కరువయ్యాయి. దీనికి తోడు రాత్రివేళల్లో మద్యం సేవించి జులాయిదారులు మరింత అపరిశుభ్రంగా తయారు చేస్తున్నారు. మార్కెట్‌కు తగినంత సిబ్బంది కూడా లేకపోవడంతో అభివృద్ధి మరింత కుంటు పడుతోంది. డిప్యూటేషన్‌పై ఒక కార్యదర్శి హోస్పేట నుంచి, బళ్లారి నుంచి ఒక ఎఫ్‌డీఏ విధులు నిర్వహిస్తున్నారు. అలాగే ఏపీఎంసీకి 16 మంది సభ్యులు అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా నియమించి ఏడాదైనా ఎన్నికలు జరపలేదు. ఇప్పటికైనా అధికారులు ఎన్నికలు నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.



కంప్లి ఏపీఎంసీ కార్యాలయం



తాగి పారేసిన మద్యం బాటిళ్లు

టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది

- రాజు, మార్కెట్ కార్యదర్శి



మార్కెట్ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నాం. 25 ఎకరాలు మార్కెట్లో తమకు కేటాయించిన స్థలాల్లో వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. సకాలంలో పన్నుల వసూళ్లు చేపడుతున్నాము. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు విడుదల కాలేదు. 2023-24వ సంవత్సరం ఆర్ఐడీఎఫ్ రూ. 2.50కోట్ల నిధులు మంజూరయ్యాయి. టెండర్ల ప్రాసెస్ కూడా జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వ నిధులను విడుదల చేయకపోవడంతో అభివృద్ధి ఆగిపోయింది. సిబ్బందిని, అధికారులను కూడా కేటాయించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.



వెలగని విద్యుత్ లైట్లు



దిష్టిబొమ్మలా నీటి ట్యాంకు

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



మృతి చెందిన యువకుడు

సిరుగుప్ప, ఫిబ్రవరి 12 : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృత్యువాత పడ్డాడు. ఆదివారం రాత్రి సిరుగుప్ప పట్టణ శివారులోని ఆదోని రోడ్డు మార్గంలో సిరుగుప్ప నుంచి రారావి మార్గం వైపు ద్విచక్రవాహనంలో వెళుతున్న వీరేష (24)ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రోడ్డుపై పడివున్న విషయాన్ని స్థానికులు పోలీసులకు తెలియజేశారు. పట్టణ ఎస్ఐ తిమ్మప్ప నాయక్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు వున్నారు. ఇతను దేశనూరు స్వగ్రామం రారావిలో వివాహం చేసుకున్నాడు. భార్య ప్రసవించిన సందర్భంగా చూసేందుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. యువకుడి మృత్యువాత పడడంతో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

అనుమతి లేని బస్సులపై ఆర్టీఓ అధికారుల కొరడా

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 12 : అనుమతి లేని బస్సులపై ఆర్టీఓ అధికారులు కొరడా ఝులిపించారు. తాలుకాలోని మోకా, సిరుగుప్ప, బెంగళూరు, అనంతపురం రోడ్లలో పర్మిట్‌కు విరుద్ధంగా తిరుగుతున్న ఏపీఎస్ ఆర్టీసీ, కేఎస్ ఆర్టీసీ ప్రైవేటు బస్సులపై కేసులు నమోదు చేశారు. మోటార్ సీనియర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ నేతృత్వంలో తనిఖీలు నిర్వహించి వివిధ బస్సులపై కేసులు నమోదు చేశారు. సీనియర్ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ అధికారులు గిరి, హేమంత్ కుమార్, దేవేంద్ర ప్రసాద్, మహమ్మద్ రఫీక్ తదితరులు ఈ స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్నారు.

16న అఖిల భారత సార్వత్రిక సమ్మె : సీఐటీయూ

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 12 సెంట్రల్ ఫోరం ఆఫ్ యూనియన్స్(సీపీయూ) సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) సంయుక్తంగా 2024 16న అఖిల భారత సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్‌కు పిలుపునిచ్చాయని సీఐటీయూ జిల్లాధ్యక్షుడు సత్యబాబు తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక, పెట్టుబడిదారీ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త సమ్మెలకు పిలుపునిచ్చా రు. కార్మికులు, కర్షకులు సమష్టిగా పోరాడి నిత్యం సమతూకంగా, ఐక్యంగా పోరాటాలు సాగించాలన్నారు. ఫిబ్రవరి 16న దేశవ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ బంద్ చేపడ్తామన్నారు. ఈసందర్భంగా ముఖ్యమైన డిమాండ్ల సాధనకు డిమాండ్ చేస్తామన్నారు. నిత్యావసర వస్తువులు, పెట్రోలియం ఉత్పత్తులు , మందుల ధరల పెరుగుదలను అడ్డుకోవాలన్నారు. రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర కరువును జాతీయ విపత్తుగా ప్రకటించి, రుణమాఫీ, శాస్త్రీయంగా పంట నష్టపరిహారం, అన్నదాత-ఉపాధి భూమి హక్కులతో పాటు పలు డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ఈసందర్భంగా ఏఐయూటీయూసీ జిల్లాకార్యదర్శి ప్రమోద్, జిల్లాధ్యక్షుడు ఆదిమూర్తి, శివశంకర్, బసన్న, కర్ణాటక రైతు సంఘం హరిత సేన గౌరవాధ్యక్షుడు సంగనకల్లు కృష్ణప్ప, జిల్లా అధ్యక్షుడు లేపాక్షి పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సత్యబాబు,ప్రమోద్

ఘనంగా కాయక శరణు మాదార చెన్నయ్య జయంతి

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 12: నగరంలో కాయక శరణు మాదార చెన్నయ్య జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లాపాలనాధికారి, జిల్లాపంచాయతీ సంయుక్త సముదాయంలో రాజ్‌కుమార్ రోడ్డు కల్చరల్ కాంప్లెక్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన కాయక శరణు మాదార చెన్నయ్య, దోహర కక్కయ్య, సమగర హరలయ్య, మాదర దూలయ్య, ఉరిలింగ పెద్ది జయంతి కార్యక్రమాన్ని నగర మేయర్ ప్రారంభించి మాట్లాడారు. బసవన్న అనుభవ మందిరంలో అన్ని వర్గాల భక్తులు ఉన్నారు. వారిలో మాదార చన్నయ్య, దోమధ కక్కయ్య, మాదార దూలయ్య, ఉరిలింగపెద్ది, సమగర హరలయ్య ఐదుగురు కాయక శరణులు వారి జీవిత విలువలు సమాజానికి ప్రభుత్వం చాటి చెబుతుందన్నారు. సమాజ నిర్మాణానికి శరణుల వచనాలను అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. విశ్రాంత అధ్యాపకులు సుశీల మాట్లాడుతూ 12వ శతాబ్దపు శరణులు సమాజంలోని ఒడిదుడుకులను సులభతరమైన భాష ద్వారా సామాన్యులకు తెలియజేశారన్నారు. శరణ వచనాలతో విద్యార్థుల్లో సంపూర్ణ వ్యక్తిత్వం సాధ్యమవుతుందన్నారు. విద్యార్థులు మొబైల్ ఫోన్ల వాడకం తగ్గించి చదువుపై దృష్టిసారించాలన్నారు. పుస్తకాలను ఎక్కువగా అధ్యయనం చేయాలని అన్నా రు. కార్యక్రమంలో కన్నడ సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు బి.నాగరాజ్, ఆ శాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



శరణుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న మేయర్ శ్వేత, తదితరులు

అవయవ దాన నమోదు ప్రారంభం

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 12: నగరంలోని జైన్ మార్కెట్ సమీపంలో గురుపుష్కర జైన సేవా సమితి ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం, జిల్లాపంచాయతీ, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, వీఐఎంల సహకారంతో సోమవారం స్వచ్ఛంద అవయదాన నమోదు శిబిరాన్ని నిర్వహించారు. గురుపుష్కర్ జైన్ సేవాసమితి ఉపాధ్యక్షులు సూరజ్మల్ అవయవదాన నమోదు శిబిరాన్ని ప్రారంభించారు. జైన్ మార్కెట్, ఇతర మార్కెట్ షాపులకు వెళ్ళి రిజిస్ట్రేషన్ నమోదు చేసుకుని ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అవయవదానంలో బళ్లారి జిల్లా జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో ఉందని, ఇప్పటి వరకు మొత్తం 4240 రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. వీరిలో 2,238పురుషులు, 2002 మంది మహిళలు నమోదు చేసుకున్నారు. ఈసందర్భంగా జిల్లాకుష్టు వ్యాధి నిర్మూలన అధికారి డాక్టర్ వీరేంద్రకుమార్, వైద్యాధికారిణి డాక్టర్ కరుణ,నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ శరణ్య, డాక్టర్ కార్తీక్, డాక్టర్ కావ్య, జిల్లా ఆరోగ్య విద్యాశాఖాధికారి ఈశ్వర్ దాసప్పనవర్, సేవా సమితి కేవల్ చంద్ర, అశోక భండారి, ప్రకాశ్ మెహతా, పూలచంద, సురేశ్‌కుమార్, దినేశ్, సురేశ్ వినాకియా, ధన్‌రాజ్ వైద్యాధికారులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



అవయవ దాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైద్యాధికారులు

'వ్యవసాయ భాగ్య'ను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే

సిరుగుప్ప, ఫిబ్రవరి 12 : 'వ్యవసాయ భాగ్య' పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బీఎం నాగరాజు సూచించారు. సోమవారం పట్టణంలో తాలుకా వ్యాప్తంగా రైతులకు లక్షలాది రూపాయల వ్యవసాయ పరికరాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల అభివృద్ధి కోసం ఎన్నో పరికరాలను అందజే స్తోందని, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌బీ పటేల్, సాంకేతిక అధికారి గర్జప్ప, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



వ్యవసాయ పరికరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజు

రాజ్యాంగంపై అవగాహన తప్పనిసరి: తహసీల్దార్

కంప్లి, ఫిబ్రవరి 12 : అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ రేణుక, శిశు సంక్షేమ తాలుకా ఆఫీసర్ మమత, ముఖ్య అధికారి దుర్గన్నలు పేర్కొన్నారు. సోమవారం కురుగోడు పట్టణంలోకి వచ్చిన బాబా అంబేడ్కర్ రథాన్ని పట్టణంలో భాజాభజంత్రీలతో ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా యువతీయువకులు, విద్యార్థులు వారి జీవిత చరిత్ర ఎంత ముఖ్యమో, రాజ్యాంగం రచించిన బాబా అంబేడ్కర్‌ను స్మరించుకోవడం కూడా ముఖ్యమేనన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, పురసభ కౌన్సిలర్లు, సంఘ సంస్థ నేతలు, ప్రముఖులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

బళ్లారి రూరల్, ఫిబ్రవరి 12: సండూరు తాలుకా చోర్నూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గల ఎర్రనాయనపల్లి గ్రామానికి చెందిన హనుమంతు (23) అనే యువకుడు అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జనవరి 20వ తేదీన బయటకు వెళ్లిన హనుమంతు ఇంటికి తిరిగి రాకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్ స్టేషన్ నెంబర్లు 08392 258400.9480803063, 08329560100 నెంబర్లకు తెలియజేయాలని పోలీసులు తెలిపారు.

హంపిలో స్వచ్ఛత పనులకు శ్రీకారం

కంప్లి, ఫిబ్రవరి 12 : ప్రసిద్ధి గాంచిన హంపి పుణ్యక్షేత్రంలో హోమ్ గార్డు శాఖ అధికారులు స్వచ్ఛతా పనులు చేపట్టారు. సోమవారం విరుపాక్షేశ్వర దేవాలయ ప్రాంగణం ముందు చీపుర్లు పట్టి పరిశుభ్రతా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా హోమ్ గార్డు శాఖ అధికారి బసవరాజు అగసర మాట్లాడుతూ హంపి పవిత్ర పుణ్యక్షేత్రమని, దుకాణాలు యజమానులు, పర్యాటకులు ప్లాస్టిక్ సామగ్రిని, చెత్తాచెదారాన్ని ఎక్కడ పడితే అక్కడ పారేయకుండా అధికారులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు రజిని షణ్ముఖ, పీడీవో గంగాధర, హోమ్‌గార్డు హోస్పేట శాఖ అధికారి ఎస్‌ఎం గిరీష్, వల్యానాయక్, సిద్ధప్ప, శ్రీశైల అలసంగి, బాషా సాహెబ్, హోస్పేట, కమలాపురం శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



స్వచ్ఛతా పనుల్లో హోంగార్డ్స్

హోసూరు జోన్

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

హోసూరు, ఫిబ్రవరి 12: జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. కృష్ణగిరి జిల్లా హోసూరులో 2023 డిసెంబరులో జిల్లాస్థాయి సీనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్టు తదుపరి తిరువణ్ణామలైలో జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో కృష్ణగిరి జిల్లా నుంచి 94 మంది పాల్గొనగా18 మంది రాష్ట్రస్థాయి విజేతలుగా గెలుపొందారు. పూనైలో ఈనెల 14నుంచి 17 వరకు జాతీయస్థాయి సీనియర్స్ అథ్లెటిక్స్ పోటీలు జరుగనున్నాయి. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా సీనియర్ అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి జెబస్టియన్, రోటరీక్లబ్ ధర్మేశ్‌పటేల్‌లు యూనిఫాం అందజేసి అభినందించారు.

గ్రీవెన్స్‌లో 248 వినతులు



వినతిపత్రాలు అందుకుంటున్న కలెక్టర్ సరయూ

హోసూరు (కృష్ణగిరి), ఫిబ్రవరి 12: కృష్ణగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం కలెక్టర్ కెఎం సరయూ నేతృత్వంలో ఏర్పాటైన పీపుల్స్ గ్రీవెన్స్ రిడ్రెసల్ డేలో 248 వినతులు వచ్చాయి. ఇళ్ల పట్టాలు, ఉచిత కుట్టుమిషన్‌లు, వృద్ధాప్య పింఛన్, రోడ్డు సౌకర్యం, విద్యుత్ కనెక్షన్ వంటి పలు డిమాండ్లపై ప్రజల నుంచి 248 వినతి పత్రాలు వచ్చాయని కలెక్టర్ సరయూ తెలిపారు. అర్హులైన అర్జీలపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించామన్నారు. అనంతరం దివ్యాంగుల సంక్షేమ శాఖ తరపున 9మందికి సంక్షేమాలు అందచేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సాధనకురళ్, స్పెషల్ అసిస్టెంట్ పన్నీర్‌సెల్వం, జిల్లా కలెక్టర్ ఇంటర్వ్యూ అసిస్టెంట్ ఎస్ సుందరరాజ్, జిల్లా వెనుకబడిన సంక్షేమ అధికారి పద్మలత, దివ్యాంగుల సంక్షే మ అధికారి మురుగేశన్, దాక్షాయిణి పాల్గొన్నారు.

పెరిగిన క్యాబేజీ ధరలు

రైతుల్లో హర్షం

హోసూరు, ఫిబ్రవరి 12: క్యాబేజీ ధరలు పెరగడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడు-కర్ణాటక సరిహద్దులో బాగలూరు, బేరిక్కై, శూలగిరి, కెలమంగలం, తళి, అంచెట్టిలోని 50కి పైగా కొండ ప్రాంతాలల్లో సుమారు 2వేల ఎకరాలలో కూరగాయలు సాగు చేస్తున్నారు. 3 నెలల పంట క్యాబేజీ ఇప్పుడు కోతకు సిద్ధంగా ఉంది. కర్ణాటక, ఆంధ్రా ప్రాంతం నుంచి సరఫరా తక్కువగా తగ్గడంతో ఇక్కడ క్యాబేజీ ధర పెరిగింది. గత నెలలో వ్యాపారులు కిలో క్యాబేజీ రూ.5 నుంచి రూ.6 రూపాయల వరకు పలకగా ప్రస్తుతం రూ.10 నుంచి రూ.20దాకా పలుకుతోంది. ఎకరాకు రూ.80వేల దాకా ఖర్చు అవుతుందని కిలో ధర ఆశాజనకంగా ఉందని రైతులు తెలిపారు.



ఏపుగా పెరిగిన క్యాబేజీ పంట

'చింత' తీరింది..



చెట్ల నిండా విరగకాసిన చింత

హోసూరు(సిఫ్‌కాట్), ఫిబ్రవరి 12: హోసూరు సమీపంలో ఉరిగం, ఉల్లుగురికి, బేరిక్కై, బాగలూరు తదితర ప్రాంతాల్లో లక్షకు పైగా చింతచెట్లు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ఏటా 20 టన్నుల చింతపండు ఉత్పత్తి అవుతుంది. ముఖ్యంగా ఉరిగం చింతపండుకు మంచి డిమాండ్ ఉంది. గత ఏడాది నష్టం చవిచూసిన రైతులు ఈసారి పంట దిగుబడి ఆశాజనకంగా ఉండడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యమైన చింతపండు దిగుబడి రావడంతో గతేడాది కంటే మంచి ఆదాయం వస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఉరిగం ప్రాంత రైతులు మాట్లాడుతూ చెట్ల నుంచి కాయలు కోసి గ్రేడింగ్‌కు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. తద్వారా మంచి ధర సాధ్యమన్నారు. దిగుబడి బాగుండడంతో పక్క రాష్ట్రాల వ్యాపారులు ఇప్పుడు చింతచెట్లను చూసి పోటీ పడి చెట్లను లీజుకు తీసుకుంటున్నారన్నారు.

పథకాలపై ఛాయాచిత్ర ప్రదర్శన

హోసూరు(కృష్ణగిరి), ఫిబ్రవరి 12: వివిధ శాఖల ద్వారా కృష్ణగిరి జిల్లాలో అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా కావేరిపట్టణం పంచాయతీ యూనియన్ సుండేగుప్పం పంచాయతీ మణనగర్ గ్రామంలో ఫోటో ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఛాయచిత్రాల ద్వారా ప్రభుత్వం అందించే ప్రభుత్వం సంక్షేమాలను వివరించారు. వైద్యం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, వినూత్న మహిళా పథకాలు, ముఖ్యమంత్రి అల్పాహార పథకం, ఉమెన్స్ రైట్స్ గ్రాంట్ పథకం, 108 అంబులెన్స్ సేవలు వంటి పథకాలు పొందుపరిచారు. కృష్ణగిరి జిల్లాలోని కొండ గ్రామాలకు ఎటువంటి వ్యాధులు సోకకుండా ముందు జాగ్రత్త చర్యలు, వైద్య శిబిరం, పాఠశాల, కళాశాల విద్యార్థులు, యువతకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం, రైతులకు సబ్సిడీ వ్యవసాయ పనిముట్లు అందించడం, రైతులకు 1.50 లక్షల విద్యుత్ కనెక్షన్ పథకం వంటివి ఉన్నాయి. దివ్యాంగులు, పాఠశాల విద్యార్థులకు రెయిన్‌బో పథకం, విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు అందజేయడం, మహిళా స్వయం సహాయక బృందాలకు వ్యాపారరుణాలు అందించడం, పసుపు సంచుల వాడకంపై అవగాహన, అందుబాటులో అంతర్జాతీయ పూల వేలం కేంద్రం, అన్ని గ్రామాల సమగ్ర వ్యవసాయ అభివృద్ధి ప్రాజెక్టు తదితర పథకాలను ఫోటోల ద్వారా పొందుపరిచారు. 500 మందికి పైగా ప్రజలు వీక్షించారు.



ఎగ్జిబిషన్‌ను వీక్షిస్తున్న ప్రజలు

ఘనంగా మార్కండేయస్వామి జయంతి

తోరణగల్లు, ఫిబ్రవరి 12 : పద్మశాలి కుల బాంధవులు సోమవారం మార్కండేయ స్వామి జయంతిని ఘనంగా నిర్వహించుకున్నారు. కురేకుప్ప పట్టణంలోని మార్కండేయ స్వామి దేవస్థానంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మార్కండేయ భావచిత్రాన్ని కురేకుప్ప పట్టణంలోనూ, తోరణగల్లు స్టేషన్‌లోనూ ఊరేగించారు.ఈ సందర్భంగా కురేకుప్ప, తోరణల్లు గ్రామ పద్మశాలి సంఘం అధ్యక్షుడు జక్కా తిప్పయ్య స్వామి, సూరప్ప, అధ్యక్షుడు ఉమాపతి, పాండు, రంగప్ప, వెంకటేశులు, రంగయ్య, గంగాధర, శ్రీనివాసులు, ఇతర పదాధికారులు మహిళలు పాల్గొన్నారు.



మార్కండేయ స్వామి భావచిత్రాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

ర్యాబీస్ వ్యాక్సిన్‌తో ప్రాణాలు కాపాడుకోండి

● కుక్కకాటుపై నిర్లక్ష్యం వహించరాదు: జడ్పీ కార్యదర్శి గిరిజాశంకర్



కరపత్రాలను విడుదల చేస్తున్న వైద్యాధికారులు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 12: కుక్కకాటుకు గురైన వెంటనే ర్యాబీస్ వ్యాక్సిన్ వేయించి వ్యాధి నుంచి ప్రాణాపాయం నుంచి బయట పడవచ్చని జీపీ సెక్రటరీ గిరిజాశంకర్ సూచించారు. సోమవారం జిల్లాపంచాయతీ హాల్లో రేబీస్‌వ్యాధి నియంత్రణపై జరిగిన అంతర్ శాఖల సమన్వయ కమిటీ సమావేశంలో జిల్లాపంచాయతీ ఉప కార్యదర్శి గిరిజా శంకర్ మాట్లాడుతూ కుక్కకాటుతో ప్రాణాంతకంగా పరిణమించే ర్యాబీస్ వ్యాధిని అరికట్టవచ్చని, ప్రజలు సమీపంలోని ప్రభుత్వాసుపత్రికి వెళ్ళి వైద్యుల సూచన మేరకు నిర్ణీత వ్యవధిలో టీకాలు వేయించుకోవాలన్నారు. పెంపుడు కుక్కల యజమానులు క్రమం తప్పకుండా ర్యాబీస్ టీకాలు వేయించాలని, వీధికుక్కలు, పెంపుడు కుక్కలు ఏవీ కరిచినా నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఇటీవల పట్టణ ప్రాంతాల్లో కుక్కకాటు కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని , అనుమతి లేకుండా మాంసం విక్రయించరాదన్నారు. కుటుంబ సంక్షేమ అధికారి రమేశ్‌బాబు మాట్లాడుతూ కుక్కకాటును నిర్లక్ష్యం చేయరాదని గాయాన్ని సబ్బుతో నీటితో బాగా కడిగి, సమీపంలోని ఆసుపత్రిని సందర్శించాలన్నారు. జిల్లా సర్జన్ బసవరెడ్డి, జిల్లాసర్వే అధికారి మరియంబి, జిల్లా క్షయ నిర్మూలన అధికారి డాక్టర్ ఇంద్రాణి, జిల్లా కుష్టువ్యాధి నిర్మూలన అధికారి వీరేంద్రకుమార్, జిల్లా తాలూకా పంచాయతీ అధికారులు, పశుసంవర్ధక శాఖ, మున్సిపల్ కార్పోరేషన, ఇతర శాఖల వైద్యాధికారులు , ఈశ్వర్ దాసప్ప పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

సిరుగుప్ప, ఫిబ్రవరి 12 : నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ షంషాలంను సోమవారం మైనార్టీ గ్రామీణ ప్రాంత అధ్యక్షుడు అల్లాబక్షి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మైనార్టీ సంఘం సభ్యులు, పదాధికారులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కేశ్. శంకరనారాయణ కాలమ్...

సరోజినీ నాయుడు (జయంతి)



నైటింగేల్ ఆఫ్ ఇండియా (భారతకోకిల)గా పేరొందిన సరోజినీ నాయుడు 1879 ఫిబ్రవరి 13న హైదరాబాద్‌లో జన్మించారు. రచయిత, ప్రముఖ రాజకీయ నేతగా ఆమె రాణించారు. మహాత్మా గాంధీ మార్గంలో ఆమె కూడా స్వాతంత్ర్య సంగ్రామంలోనూ చురుగ్గా పాల్గొన్నారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌కు 1925లో అధ్యక్షురాలిగా వ్యవహరించారు. అంతేకాక యునైటెడ్ ప్రావిన్సెస్‌కు గవర్నర్‌గా వ్యవహరించారు. ఆమె రచనలో దేశభక్తి, పిల్లల గురించే కాక శృంగారం, ట్రాజెడీ తదితర భిన్న అంశాలతో కూడి ఉండేవి. 1949 మార్చి 2న కన్నుమూశారు.

ఫైజ్ అహ్మద్ ఫైజ్ (జయంతి)



ఫైజ్ అహ్మద్ ఫైజ్ 1911 ఫిబ్రవరి 13న పంజాబ్ రాష్ట్రం నరోవల్ (ప్రస్తుతం పాకిస్థాన్) లో జన్మించారు. ఉర్దూ, పంజాబీల భాషలలో రచయిత, కవిగా రాణించారు. 'ఏ మ్యాన్ ఆఫ్ వైడ్ ఎక్స్‌పీరియన్స్'గా 'గ్రేటెస్ట్ పోయెట్'గా అభివర్ణించ బడ్డారు. ఉపాధ్యాయుడు, ఆర్మీ అధికారి, పాత్రికేయుడు, ట్రేడ్ యూనియనిస్ట్, బ్రాడ్‌కాస్టర్‌గా ఇలా విభిన్నరంగాలలో రాణించారు. 'లెనిన్ పీస్ ప్రైజ్' అందుకున్న తొలి ఏషియన్. ఆయన రచనలు ఇంగ్లీషు, రష్యన్ తదితర భాషలలోకి అనువాద మయ్యాయి. సాహిత్యంలో నోబెల్ ప్రైజ్‌కు నామినేట్ అయ్యారు. 1984 నవంబరు 20న కన్నుమూశారు.

ఉత్సాహంగా రాజ్యాంగ జాగృతి జాతా

దొడ్డబళ్ళాపుర, ఫిబ్రవరి 12: బెంగళూరు గ్రామీణ జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో తాలూకాలోని ఆరూఢి గ్రామ పంచాయతీ సాసలు గ్రామపంచాయతీ, సక్కరె గొల్లహళ్ళి పంచాయతీలలో రాజ్యాంగ జాగృతా జాతా సోమవారం ఉత్సాహంగా జరిగింది. గ్రామస్థులు కళశాల ద్వారా స్వాగతం పలకగా పలు సాంస్కృతిక కళా బృందాలు భాగస్వామ్యులయ్యాయి. రాజ్యాంగ పీఠికను నిర్వాహకులు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సాసలు గ్రామపంచాయతీ అధ్యక్షురాలు నందిని, ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవమ్మ, సభ్యులు, పీడీఓ తిరుపతి, నోడల్ అధికారి సునిల్ జీఎన్, ఆరూఢి గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు నాగరత్నమ్మ, సభ్యులు, పీడీఓ మల్లేష్, సక్కరె గొల్లహళ్ళి పంచాయతీ అధ్యక్షులు హనుమయ్య, ఉపాధ్యక్షురాలు దివ్యశ్రీ తిమ్మేగౌడ, వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మునేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 12: తాలూకాలోని జంగమకోటె హోబళి జే వెంకటాపుర గ్రామపంచాతీయ పరిధిలోని సుగటూరు గ్రామంలో మునేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. సోమవారం జరిగిన విశేషపూజల్లో సమాజసేవకుడు ఆంజినప్ప కుమారుడు రాహుల్‌గౌడ పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ఈ సందర్భంగా రాహుల్‌గౌడ మాట్లాడుతూ గ్రామస్థులంతా చేరి ఆలయాన్ని నిర్మించారని ఇందులో పాల్గొనే అవకాశం లభించడం సంతోషంగా ఉందన్నారు. స్వామి కృపతో సకాలంలో వర్షాలు కురవాలని, మంచి పంటలు పండాలని కోరుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు అప్పాజిగౌడ, మళమాచనహళ్ళి మునిరాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై ఎమ్మెల్యే తనయుడి దాడి

రాయచూరు, ఫిబ్రవరి 12: ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకున్నాడన్న కారణంగా కానిస్టేబుల్‌పై స్థానిక ఎమ్మెల్యే కరెమ్మ జీ నాయక్ కుమారుడు జీ సంతోష్ దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటన సోమవారం జిల్లాలో సంచలనంగా మారింది. ఆదివారం మధ్యాహ్నం దేవదుర్గ సమీపంలోని కృష్ణనది నుంచి ఇసుకను అక్రమంగా తీసుకెళుతున్న లారీని అడ్డగించిన కానిస్టేబుల్ సంతోష్ దాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించాడు. కానిస్టేబుల్‌కు ఫోన్ చేసి మాట్లాడిన ఎమ్మెల్యే తనయుడు సంతోష్ ట్రాక్టర్ వదలివేయాలంటు డిమాండ్ చేశాడు. దీన్ని పట్టించుకోని కానిస్టేబుల్ హనుమంతరాయ నేరుగా ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తీసెకెళ్లి సీజ్ చేశాడు. దీంతో ఆగ్రహించిన ఎమ్మెల్యే కుమారుడు సంతోష్ తాను ఇన్‌స్పెక్షన్ బంగ్లాలో ఉన్నానని ఇక్కడికి రావాలంటు హుకుం జారీ చేశాడు. అక్కడికి వెళ్లిన కానిస్టేబుల్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే తాము పని చేస్తామని చెప్పేందుకు ప్రయత్నించగా ఎమ్మెల్యే తనయుడితో పాటు అతని చెంత ఉన్న అనుచరులు ఒక్కసారిగా కానిస్టేబుల్ పై దాడికి దిగారు. దీంతో గాయాలపాలైన కానిస్టేబుల్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు.

నిందితులపై కేసు నమోదు

విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్‌పై దాడి చేశారన్న ఆరోపణల మేరకు జిల్లాలోని దేవదుర్గ ఎమ్మెల్యే కరెమ్మ జీ నాయక్ కుమారుడు సంతోష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం నిందితుడితో పాటు అతనికి సహకరించిన మరో 8 మంది పై కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ సిద్ధం చేసినట్లు దేవదుర్గ పట్టణ ఎస్ఐ తెలిపారు.

పోలీస్ స్టేషన్ ముందు ఎమ్మెల్యే ధర్నా

విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్ పై దాడికి దిగారన్న ఆరోపణ మేరకు తన కుమారుడితో పాటు సోదరుడు వ్యక్తిగత కార్యదర్శిపై పోలీసులు కేసు చేయడాన్ని దేవదుర్గ ఎమ్మెల్యే జీ కరెమ్మ నాయక్ తీవ్రంగా ఖండించారు. పోలీసుల తీరును నిరశిస్తు సోమవారం అర్ధరాత్రి దేవదుర్గ పట్టణ పోలీస్ స్టేషన్ ముందు ఎమ్మెల్యే ధర్నాకు దిగారు. తన అనుచరులతో కలిసి దాదాపు తెల్లవారు జాము వరకు ధర్నా నిర్వహించిన ఎమ్మెల్యే అక్కడే భోజనాలు చేసి తమ నిరసన తెలిపారు. ఎమ్మెల్యే కుమారుడు, సోదరుడు, వ్యక్తిగత కార్యదర్శిపై పోలీస్ కేసు తదితర పరిణామాల నేపథ్యంలో దేవదుర్గ పట్టణంలో సోమవారం ఆసాంతం ఒకింత ఉద్రిక్తత నెలకొంది.

పాడిరంగంలో కృష్ణప్ప సేవలు అపారం

- ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి



ఎమ్మెల్యే నారాయణస్వామి తో పాడిరైతులు తదితరులు

బంగారపేట, ఫిబ్రవరి 12: కేంద్ర మాజీ మంత్రి ఎంవీ కృష్ణప్ప మన దేశ ఆస్తి అని పాడిరంగం ఇంత భారీగా అభివృద్ధి చెందేందుకు కారణమైన ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందని కర్ణాటక నగర మౌలిక సదుపాయాల అభివృద్ధి మండలి అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణ స్వామి అభిప్రాయపడ్డారు. తాలూకాలోని బూదికోటె హోబళి కాడు కదరేనహళ్ళి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం నూతన భవనం, బీఎంసీ విభాగం ప్రారంభించి దివంగత కేంద్రమంత్రి ఎంవీ కృష్ణప్ప విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ కృష్ణప్ప కేంద్ర మంత్రిగా వ్యవహరించిన తరుణంలో డెన్మార్క్ నుంచి సీమ పశువులను తెప్పించి మన రైతులలో ఆశలు కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. రాష్ట్రంలో కోచిముల్ డైరీకి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. పాడి రైతులు ప్రైవేట్ పాలడైరీకి బదులు స్థానిక కోచిముల్ ద్వారా ప్రయోజనం పొందాలన్నారు. బలమందె నుంచి కదిరేనహ్ళళ మార్గంలో భువనహళ్ళి, కోటరామగేళ గ్రామాన్ని కలిపే మార్గం అభివృద్ధికి సుమారు రూ.80లక్షలు మంజూరైందని త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. కోచిముల్ డైరెక్టర్ జయసింహ కృష్ణప్ప మాట్లాడుతూ 2021లో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో పాలడైరీ ప్రారంభమైందని, ప్రస్తుతం నూతన భవనం, బీఎంసీ కేంద్రం ప్రారంభించబడిందన్నారు. నాణ్యమైన పాలను డైరీకి ఇచ్చి అభివృద్ధికి సహకరించాలన్నారు. కాగా నందిని బ్రాండ్ ఉత్పత్తులు ప్రజాదరణ పొందాయన్నారు. కాగా బంగారపేట-కోలారు మార్గంలో పాలక్యాంప్ కార్యాలయ నిర్మాణానికి 15 గుంటల భూమిని కేఎంఎఫ్‌కు ఉచితంగా ఎమ్మెల్యే కేటాయించారన్నారు. ఈ భూమి విలువ సుమారు రూ.2.5కోట్లుగా ఉందన్నారు. ఇక్కడ విధానసౌధ తరహాలో భవనం నిర్మించారని ఈనెల 29న ప్రారంభం కానుందన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ శ్రీనివాసగౌడ, డీసీసీ బ్యాంక్ డైరెక్టర్ పిచ్చహళ్ళి గోవిందరాజ్, కేవీ మురళిశంకర్‌రెడ్డి, మోహన్‌బాబు, కేవీ వెంకటరమణ, ఎస్‌కేడీ ఆర్‌డీపీ ప్రాజెక్ట్ ఆఫీసర్ చేతన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సుత్తూరు జాతరలో 'హళ్లికార్ కృష్ణ'



కృష్ణ ఎద్దుతో బోరేగౌడ

బెంగళూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడలు, వ్యవసాయం పశుసంపద పెంపకం పట్ల భావితరాలు గుర్తుంచుకునేలా సుత్తూరు మఠం ఏర్పాటు చేసిన జాతర తలపించింది. పరుషలో కోటి రూపాయల విలువైన హళ్ళికార్ కృష్ణ ఎద్దు అందరినీ ఆకట్టుకుంది. కృష్ణ యజమాని, మండ్య జిల్లా మలవళ్ళి నివాసి బోరేగౌడ మీడియాతో మాట్లాడుతూ కృష్ణను ప్రత్యేకంగా పెంచుకుంటున్నామన్నారు. ఎక్కడ జాతరకు వెళ్లినా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోందన్నారు. కృష్ణ జాతి దూడల కోసం రాష్ట్రం నుంచే కాకుండా వివిధ ప్రాంతాలనుంచి వీర్యం కోసం డిమాండ్ ఉందన్నారు. రామనగరలోని అంజనాపురలో కృష్ణ పుట్టిందని, అక్కడే పేరు పెట్టారన్నారు. రెండు నెలల తర్వాత మండ్య రైతు ఒకరు ఆవుతోపాటు దూడను కొనుగోలు చేశారన్నారు. మండ్య రైతునుంచి ముత్తప్పరై కొనుగోలు చేశారని, ఆయన నుంచే రూ.2.75లక్షలకు తీసుకున్నామన్నారు. ఐదేళ్లుగా పెంచుకుంటు న్నామన్నారు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ వంటి రికార్డులకు చేర్చాలన్నదే ఆశయ మన్నారు. తొలుత రూ.6 లక్షలకు అడిగారని ప్రస్తుతం కోటి రూపాయల దాకా డిమాండ్ ఉందన్నారు. ఆరేళ్ల వయసు కల్గిన కృష్ణ ఆరు అడుగుల ఎత్తు, 9 అడుగుల పొడవు, 900 కేజీల బరువు ఉందన్నారు. హళ్ళికార్ కృష్ణ పేరిట రెండుమూడు వాట్సప్ గ్రూప్‌లు కూడా ఉన్నాయని, 12వేలమంది ఫాలోయర్స్ ఉన్నారన్నారు. ప్రతి తాలూకాలోనూ అభిమానులు ఉన్నారన్నారు. పూర్వీకుల నుంచి బసవణ్ణను పూజలు చేసేవారని, ఆ ఫలమే కృష్ణ రూపంలో ఉందన్నారు. కృష్ణ నుంచి వీర్యం సేకరించే ప్రక్రియ ప్రారంభించినప్పుడు అందరూ కష్టమని సూచించారన్నారు. హర్యానాకు చెందిన కర్మవీర్‌సింగ్ నుంచి వీర్యం సేకరించే విధానాన్ని మా డాక్టర్ తెలుసుకుని శిక్షణ పొందినా సాధ్యం కాలేదని, అయితే గుజరాత్‌కు చెందిన మనీష్ అనే పశువైద్యాధికారి ద్వారా వీలైందన్నారు. వెయ్యి రూపాయల వరకు వీర్యం విక్రయిస్తున్నామన్నారు. రోజూ ప్రత్యేకమైన దాణా ఇస్తామని, పశుగ్రాసంతో పాటు మసాలా, గోది బూసా, జొన్నలతోపాటు దోస కాయ, బొప్పాయిలు ఇస్తామన్నారు. కాగా జాతర పల్లె వాతావరణం కనిపిం చేలా సాగింది. గ్రామీణ క్రీడలలో యువతీ యువకులు, భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

అంతర్జాతీయ కిక్ బాక్సింగ్‌లో రాణించిన సతీష్, మనోజ్



అంతర్జాతీయ క్రీడావేదికపై భారత జాతీయ జెండాను ఎగుర వేసిన వెండి పతక విజేతలు సతీష్, మనోజ్‌లు

బెంగళూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): వరల్డ్ అసోసియేషన్ ఆఫ్ కిక్ బాక్సింగ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన 3వ అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ టోర్నమెంటులో మచిలీపట్నంకు చెందిన చలాది సతీష్, మనోజ్‌లు అద్భుతంగా రాణించారు. కర్ణాటక అసోసియేషన్ ఆఫ్ కిక్ బాక్సింగ్ తరుపున వీరు పాల్గొనడం విశేషం. ఫిబ్రవరి 7 నుంచి 11 వరకు న్యూ ఢిల్లీలోని ఇందిరాగాంధీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని ఎంకే జాదవ్ ఇండోర్ ఆడిటోరియంలో జరిగిన ఈ పోటీల్లో చలాది సతీష్ రెండు వెండి పతకాలను సాధించగా, బాక్సింగ్ ఫైటర్ మనోజ్ మరో రజత పతకాన్ని తన సొంతం చేసుకున్నారు. అంతర్జాతీయ వేదికపై అద్భుతంగా రాణించడం ద్వారా వీరిద్దరు ఇటు కర్ణాటక పేరు ప్రతిష్ఠలను ఇటు మచిలీపట్నం పేరును మార్మోగేలా చేశారు. సతీష్ 84 కేజీల కేటగిరీలో తన ప్రత్యర్థి రెండు సార్లు యుఎఫ్‌సి చాంపియన్ షిప్‌ను గెలుపొందిన ఉజ్బెకిస్తాన్ క్రీడాకారుడు డిజిరెవ్ సుఖారత్‌పై విజయం సాధించి వెండిపతకాన్ని కైవసం చేసుకోవడంతో పాటు లైట్ కాంటాక్ట్ ఫైట్‌లోనూ సత్తా చాటుకుని ఫైనల్‌లో మన దేశానికే చెందిన పుదుచ్చేరి క్రీడాకారుడు రంగనాథన్‌తో లపడి రెండో వెండిపతకాన్ని కైవసం చేసుకున్నారు. మచిలీపట్నంలోని ప్రముఖ పాత్రికేయుడు చలాది పూర్ణచంద్రరావు కుమారుడైన సతీష్ 2001లో గోవాలో జరిగిన జాతీయ కిక్ బాక్సింగ్ పోటీల్లో 74 కిలోల కేటగిరిలో స్వర్ణపతకాన్ని సాధించి జాతీయ విజేతగా నిలిచిన సంగతి విదితమే. కాగా మరో క్రీడాకారుడు దాసరి మనోజ్ 94 కిలోల కేటగిరిలో ప్రముఖ మార్షల్ ఆర్ట్స్ ట్రైనర్ ఆర్మీకి చెందిన మాజీ క్రీడాకారుడు రాజేంద్రన్ రాజ్‌కుమార్‌పై విజయాన్ని నమోదుచేసి వెండి పతకాన్ని అందుకున్నాడు. మనోజ్ తండ్రి ఆర్టీసీలో ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందారు. కాగా ఈ ఇద్దరు క్రీడాకారులు బెంగళూరులో మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యేక శిక్షణ పొందారు. అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటిన సతీష్, మనోజ్‌లను కర్ణాటక అసోసియేషన్ ఆఫ్ కిక్ బాక్సింగ్ సంస్థ సోమవారం ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపింది.

నాలుగు దశాబ్దాలుగా సంఘ్ సేవలు

- రాజ్యసభకు నారాయణ కృష్ణనాస్ భాండగె



నారాయణ కృష్ణనాస్ భాండగె

బెంగళూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాలుగా నిస్వార్థంగా సంఘ్ సేవలలో భాగస్వామ్యులైన నారాయణ కృష్ణనాస్ భాండగెకు రాజ్యసభ అవకాశం దక్కింది. ఆర్ఎస్ఎస్, బీజేపీలలో వివిధ హోదాలలో ఆయన పనిచేశారు. బాగల్కోటె జిల్లాలో ఏబీవీపీ శాఖను ఆరంభించి ఆరేళ్లపాటు విద్యార్థులకు బోధించారు. విశ్వహిందూ పరిషత్ ఇన్‌చార్జ్‌గా కొనసాగారు. ఉడుపి పెజావర మఠాధిపతి దివంగత విశ్వేశతీర్థస్వామిజీతో కలసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వరద ప్రాంతాల సాయంలో ఎంతోకృషి చేశారు. 1973 నుంచి జనసంఘ్ ద్వారా రాజకీయాల్లోకి వచ్చారు. అల్మట్టిని ప్రధానమంత్రి హోదాలో ఇందిరాగాంధీ సందర్శించేందుకు వచ్చినవేళ నల్ల జెండాలు ప్రదర్శించిన కేసులో పోలీసుల లాఠీచార్జ్‌లో గాయపడి 18 రోజుల పాటు జైల్లో గడిపారు. దేశంలో అత్యవసర పరిస్థితి విధించిన వేళ జైలుకు వెళ్లారు. అయోధ్య వందలాదిమంది కరసేవకులను తీసుకెళ్లే సమయంలో జైల్లో గడిపారు. కశ్మీర్‌లో జరిగిన తిరంగా యాత్ర సమయంలో 60మంది సంఘ్ కార్యకర్తలతో కలసి పోరాటంలోనూ పాల్గొన్నారు. ఇలా నాలుగు దశాబ్దాలుగా వివిధ పోరాటాలు, ఆందోళనల్లో భాండగె భాగస్వామ్యులయ్యారు. విజయపుర జిల్లా బీజేపీ యువమోర్చా అధ్యక్షుడిగాను, రాష్ట్ర సంఘటనా కార్యదర్శిగాను, ఉపాధ్యక్షుడిగా, జిల్లా అధ్య క్షుడిగా పనిచేశారు. విధానపరిషత్ సభ్యుడిగాను కొనసాగారు. పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఎన్నికల్లో ఒక జిల్లాకు ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. హిందూ క్షత్రియ, ఎస్ఎస్‌కే సామాజికవర్గం ముఖ్యులుగా సామాజిక, రాజ కీయాల్లో గుర్తింపు పొందారు. లోక్‌సభ ఎన్నికలు మరికొన్ని రోజుల్లో జరుగు తున్న తరుణంలో క్షత్రియ సమాజానికి చెందిన నారాయణసాబ్ భాండగెకు రాజ్యసభ అవకాశం కలసి వచ్చింది. తద్వారా మరాఠా, క్షత్రియ సామాజికవర్గం నుంచి బీజేపీకి బలం చేకూరనుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఫార్మాస్యూటికల్స్‌కు కర్ణాటక అనుకూలం

- ఐపీఏ శాఖ ఆరంభంలో డాక్టర్ టీవీ నారాయణ



వేదికపై ఐపీఏ సభ్యులు తదితరులు

బెంగళూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఐటీబీటీ, ఏరోనాటికల్ రంగాలలో తిరుగులేని ప్రగతి సాధించిన కర్ణాటక రాష్ట్రం ఫార్మాస్యూటికల్ రంగానికి కూడా అనుకూలమని ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ (ఐపీఏ) జాతీయ అధ్యక్షులు డాక్టర్ టీవీ నారాయణ అభిప్రాయపడ్డారు. ఆదిత్య బెంగళూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ప్రాంగణంలో ఐపీఏ శాఖను ప్రారంభించారు. రాష్ట్ర డ్రగ్ కంట్రోలర్ అధికారి భాగోజీ టీ ఖానాపుర, ఐపీఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ప్రేమనాథ్ షెనైలు ముఖ్యులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీవీ నారాయణ మాట్లాడుతూ వైద్యరంగం సాంకేతికతలో ముందంజలో ఉందని అదే తరహాలోనే ఫార్మాస్యూటికల్ రంగం కూడా గణనీయంగా అభివృద్ధి చెందుతోందన్నారు. 22 ఐపీఏ రాష్ట్రశాఖలు, 59 ప్రాంతీయ శాఖలు ఉన్నాయన్నారు. ఐపీఏ శాఖల విస్తరణ ద్వారా ఫార్మసీ విద్యా ర్థులకు అనుకూలం కానుందన్నారు. సమావేశంలో బెంగళూరు పరిధిలోని 40 కళాశాలల ప్రిన్సిపాల్‌లు, 500మంది విద్యార్థులు భాగస్వామ్యులయ్యారు. మాజీ డ్రగ్ కంట్రోలర్స్ ప్రొఫెసర్ వీబీ దేశాయ్, డాక్టర్ బీఆర్ జగశెట్టి, జాతీయ కార్యదర్శి సురేశ్‌ఖన్నా, డిప్యూటీ డ్రగ్ కంట్రోలర్ ప్రొఫెసర్ ఖాన్, డాక్టర్ రావ్ వడ్లమూడి తదితరులు పాల్గొన్నారు.

సమాజ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ పాటుపడాలి



కార్యక్రమంలో ఆదిచుంచనగిరి మఠాధిపతి డాక్టర్ నిర్మలానందనాథస్వామిజీ, మాజీ మంత్రి లింబావళి తదితరులు

మహదేవపుర, ఫిబ్రవరి 12: సమాజ అభ్యున్నతికోసం కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పాటుపడాలనేది మహనీయుల సందేశమని మాజీ మంత్రి అరవింద లింబావళి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని కణ్ణూరులో ఆదిచుంచనగిరి మఠాధిపతి డాక్టర్ నిర్మలానందనాథస్వామిజీ, విశ్వఒక్కలిగ మహాసంస్థాన మఠం చంద్రశేఖర కుమారస్వామిజీలతో కలసి ఆంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించారు. ప్రజలకోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాడప్రభు కెంపేగౌడ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి పుష్పాంజలి ఘటించారు. అనంతరం లింబావళి మాట్లాడుతూ మహనీయులు చెప్పినట్టుగా నాడప్రభు కెంపేగౌడ కూడా కేవలం ఒక సామాజిక వర్గానికి పరిమితం కాకుండా సమాజ అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. విజయనగర రాజుల మార్గదర్శకంలో బెంగళూరు నగరాన్ని రూపొందించారన్నారు. ఆయన దూరదృష్టి, పాలన, ఆదర్శాలు నేటికీ అనుసరణీయమన్నారు. రానున్న రోజుల్లో కెంపేగౌడ గురించి అధ్యయనం చేసేందుకు యువత ఉత్సాహం చూపేలా విగ్రహాన్ని ఆవిష్కరించామన్నారు. కేవలం పరిపాలనా దక్షుడే కాదని ధర్మ పురుషులన్నారు. ఈ సందర్భంగా స్ఫటికపుర మహాసంస్థాన మఠాధిపతి నంజావధూత స్వామిజీ, చిక్కబళ్ళాపుర ఎంపీ బచ్చేగౌడ, రాష్ట్ర ఒక్కలిగల సంఘం అధ్యక్షుడు ఆర్ ప్రకాశ్, బెంగళూరు తూర్పు తాలూకా ఒక్కలిగల సంఘం అధ్యక్షుడు మంజురాజ్, కణ్ణూరు పంచాయతీ అధ్యక్షుడు అశోక్, ప్రముఖులు నంజేగౌడ, నారాయణస్వామి, బండే హోసూరు మాజీ అధ్యక్షుడు నాగరాజప్ప తదితరులు పాల్గొన్నారు.

తిమ్మసంద్ర డెయిరీ కాంగ్రెస్ వశం



విజేతల బృందం

చింతామణి, ఫిబ్రవరి 12: పట్టణంలోని 31 వార్డు తిమ్మసంద్ర పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం డైరెక్టర్‌లకు ఆదివారం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారులు ఆధిక్యం సాధించారు. కాంగ్రెస్ మద్దతుదారులు రవి ఎల్, బైరేగౌడ టీఎస్, మంజునాథ్, గాయిత్రమ్మ, సోమశేఖర్, పీ దేవరాజ్, కేఎన్ సోమశేఖరాచారి, చంద్రప్పలతోపాటు ఇతరులు టీఎం శివణ్ణ, టీవీ రామమూర్తి, బాలా ఆంజనేయ పీ, రాధమ్మ, రుకేంద్ర జీఆర్ గెలుపు సాధించారు. ఎన్నికల అధికారిగా మస్తాన్‌వలి వ్యవహరించారు. నూతన డైరెక్టర్‌లను అభినందించారు.

బడ్జెట్‌లో క్రీడల అభివృద్ధికి రూ.500 కోట్లు కోరాం

- మంత్రి నాగేంద్ర వెల్లడి

బెంగళూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆర్థికశాఖను నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య శాసనసభలో ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో క్రీడల అభివృద్ధికి రూ.500 కోట్లు కేటాయించాల్సిందిగా విజ్ఞప్తి చేశామని క్రీడలు, యువజనసేవల శాఖ మంత్రి బీ నాగేంద్ర పేర్కొన్నారు. శాసనసభ లాంజ్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజస్థాన్, పంజాబ్, ఒడిశ్శా, హర్యానా తదితర రాష్ట్రాల బడ్జెట్‌లో క్రీడలకు భారీ మొత్తాలను కేటాయిస్తున్నారన్నారు. ఇదే విధానాన్ని రాష్ట్రంలోనూ అనుసరించి క్రీడారంగంలో ఆణిముత్యాలను వెలికితీసి మెరుగులు దిద్ది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా చేయడమే ప్రభుత్వం సంకల్పమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో స్టేడియంలు నిర్మించేందుకు, ప్రస్తుత స్టేడియంలోను ఆధునీకరించేందుకు రూ.600 నుంచి 800 కోట్లు అవసరం కానుందన్నారు. జిల్లాస్థాయిలో అందుబాటులో ఉన్న సీఎస్ఆర్ నిధులను గరిష్ఠంగా వినియోగించుకునే అవకాశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. క్రీడల అభివృద్ధికి తోడ్పాటు అందించేందుకు కార్పొరేట్ సంస్థలు సైతం ముందుకొస్తుండడం సంతోషంగా ఉందన్నారు. శాసనసభ సమావేశాలను అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయన్నారు. రాష్ట్రంలో గ్యారెంటీ పథకాలు అమలు కావడం ప్రతిపక్షాలైన బీజేపీ, జేడీఎస్‌లకు ఇష్టం లేదని ఆయన విరుచుకుపడ్డారు. రాజకీయాల్లో మతాన్ని జొప్పించడం మంచి పరిణామం కాదన్నారు. శ్రీరామచంద్రుడు, రామమందిరం తమ పేటెంట్ హక్కుగా భావిస్తోందన్నారు. రాష్ట్ర రైతులను ఢిల్లీకి వెళ్లకుండా మధ్యలోనే అరెస్టు చేస్తూ అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తురని మంత్రి మండిపడ్డారు.

బడ్జెట్‌పై బాగేపల్లి ప్రజల ఆశలు

బాగేపల్లి, ఫిబ్రవరి 12: సరిహద్దు ప్రాంతంలోని వెనుకబడిన నియోజకవర్గమైన బాగేపల్లికి ముఖ్యమంత్రి సిద్దరామయ్య 2023 జులై 7న సమర్పించిన బడ్జెట్‌లో ఎటువంటి పథకాలు ప్రస్తావించలేదు. తాజాగా ఈనెల 16న 2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ సమర్పించనున్నారు. ఈ తరుణంలో ఈసారైనా బాగేపల్లి నియోజకవర్గానికి ఏం ప్రకటిస్తారో అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. ప్రత్యేకించి టమోటా మార్కెట్, పారిశ్రామిక వాడ నిర్మాణం, వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్, నిరుద్యోగ యువతకు అవకాశాలు కల్పిస్తారని దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నారు. బెంగళూరు - పుట్టపర్తి రైలు బాగేపల్లిమార్గంగా సంచరించేలా డిమాండ్, హెచ్ఎన్ వ్యాలీ నీరు మూడు దశల్లో శుద్ధీకరణ, ఎత్తినహొళె నీరు, గంట్లమల్లమ్మ కాలువ బ్యారేజ్, సదుపాయాలతో కూడిన ప్రైవేట్ బస్టాండ్, గుమ్మనాయకపాళ్య పర్యాటక అభివృద్ధి వంటివి ప్రధాన డిమాండ్‌గా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సరిహద్దు కావడంతో రోడ్ల అభివృద్ధికి మరిన్ని చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. భారీ ప్రమాణంలో తాలూకాలో టమోటా సాగు అవుతున్న తరుణంలో ఇందుకు వీలుగా హైటెక్ మార్కెట్ కల్పించాల్సి ఉంది. అలాగే కేసీ వ్యాలి, హెచ్ఎన్ వ్యాలి నీరు మూడు దశల్లో శుద్ధీకరించి విడుదల చేయాలని బొమ్మై తన చివరి బడ్జెట్‌లోనూ ప్రస్తావించగా ఎమ్మెల్యే సుబ్బారెడ్డి కూడా శాసనసభలో డిమాండ్ చేశారు. కాగా నియోజకవర్గం నుంచి వేరైన చేళూరును ప్రత్యేక తాలూకాగా ప్రకటించారు. అయితే కొత్త తాలూకా అభివృద్ధికి తగిన గ్రాంట్లు కేటాయించలేదు. కాగా గ్రామీణ పాత్రికేయులకు బస్ పాస్ సౌలభ్యం కల్పిస్తామని సీఎం సిద్దరామయ్య ఇటీవల ప్రకటించారు. ఎన్నో దశాబ్దాలుగా డిమాండ్ ఎప్పుడు సాకారం అవుతుందా అని ఎదురు చూస్తున్నారు. బస్ పాస్ సదుపాయంతోపాటు గ్రామీణ పాత్రికేయులకు ఆరోగ్యకార్డు ఇవ్వాలని, రిటైరైన పాత్రికేయులకు పెన్షన్ సదుపాయం కల్పించాలని కోరుతున్నారు. ఇలా ఎన్నో డిమాండ్లకు ప్రస్తుత బడ్జెట్‌లో ఎంతవరకు సఫలీకృతం అవుతాయా..? అని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

బాలబ్రూయి ఆధునికీకరణకు శ్రీకారం



శంకుస్థాపనలో సీఎం, స్పీకర్, సభాపతి తదితరులు

బెంగళూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని బాలబ్రూయి అతిథిగృహం మూలస్వరూపాన్ని ఏమాత్రం మార్చకుండా ఆధునీకరించే పనులకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య సోమవారం శంకుస్థాపన చేశారు. బాలబ్రూయి గెస్ట్ హౌస్‌ను కర్ణాటక విధానమండల సంస్థ కార్యకలాపాలకోసం కేటాయించిన సంగతి తెలిసిందే. ఇందులో శాసనసభ ఉభయసభల సభ్యులు సేద తీరేందుకు వీలుగా పలు సదుపాయాలను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకుగాను ఆధునీకరణ పనులు చేపట్టారు. శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్, విధానపరిషత్ సభాపతి బసవరాజ్ హొరట్టి సహా పలువురు పాల్గొన్నారు.

టీటీడీ సిబ్బంది నిజాయితీ



నగను భద్రంగా అప్పగిస్తున్న సిబ్బంది

బెంగళూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు వయ్యాలికావల్‌లోని టీటీడీ ఆలయానికి దర్శనం నిమిత్తం సోమవారం వచ్చిన మీనా కుమారి అనే భక్తురాలు పోగొట్టుకున్న బంగారు నగను ఆలయ సిబ్బంది గుర్తించి అప్పగించించడం ద్వారా తమ నిజాయితీని చాటుకుంది. సీసీటీవీ పుటేజీల ద్వారా దాదాపు రెండు గంటలపాటు శ్రమించి బంగారు నగను గుర్తించారు. ఈ సందర్భంగా ఆలయ సూపరింటెండెంట్ వీ జయంతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నటరాజ రెడ్డి, విజిలెన్స్ జమేదార్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఇక దొరకదు అనుకున్న నగను సురక్షితంగా అప్పగించిందుకు ఆలయ సిబ్బందికి భక్తురాలు మీనా కృతజ్ఞతలు తెలియచేసింది.

ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలి

బెంగళూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంస్కరణల పితామహగా ఖ్యాతి గడించిన తెలుగుబిడ్డ మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రకటించడం హర్షణీయమని మాదిగ దండోరా జన జాగృతి సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎంసీ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇందుకు గాను కేంద్ర ప్రభుత్వాన్ని ప్రత్యేకంగా అభినందిస్తూ నగరంలో సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇదే రీతిన తెలుగు వారి ఆత్మగౌరవానికి ప్రతీగా ఉన్న ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్‌టీ రామారావుకు కూడా భారతరత్న పురస్కారం ప్రకటించి ఉంటే చాలా బాగుండేదన్నారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది తెలుగు ప్రజలు ఎన్టీఆర్‌కు భారత రత్న దక్కాలని చాలా కాలంగా కోరుతూ వస్తున్న సంగతిని ఆయన గుర్తుచేశారు. తెలుగు ప్రజల ఆరాధ్యదైవంగా ఉన్న రామారావుకు భారతరత్న ప్రకటించాలని ఆయన ప్రకటనలో డిమాండ్ చేశారు.

ప్రమాదకర కొమ్మలు తొలగించండి



స్తంభం చుట్టూ అల్లుకున్న కొమ్మలు

బాగేపల్లి, ఫిబ్రవరి 12: విద్యుత్ స్తంభాలు, తీగలపై ఉన్న చెటు కొమ్మలు ప్రమాదకరంగా ఉన్నాయని వాటిని వెంటనే తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. పట్టణంలోని 9వ వార్డు పాత కోర్టురోడ్డులో కొన్ని రోజులుగా ఒక విద్యుత్‌స్తంభంపై చెట్టుకొమ్మలు ఉన్నాయి. ఇందుకు సంబంధించి బెస్కాం సిబ్బంది దృష్టికి తెచ్చినా ప్రయోజనం లేకపోయిందనే విమర్శలు ఉన్నాయి. షార్ట్ సర్క్యూట్, ఇతరత్రా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకముందే తక్షణం తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. జేడీఎస్ యువ బ్రిగేడ్ రాష్ట్ర సంఘటనా కార్యదర్శి ఎంఎన్ రాజారెడ్డి మాట్లాడుతూ కనీసం ప్రమాదకరమైన కొమ్మలు తొలగించని బెస్కాం సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు.